www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 10 జులై 2025



కంచెలో చిక్కుకొని జింక మృతి

ప్రజాశక్తి- విజయపురం: స్థానిక మండలంలోని ఇల్లత్తూరు గ్రామంలో జింక రోడ్డు పక్కనే చనిపోయి ఉండటాన్ని బుధవారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. వెంటనే గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వెటర్నరీ డాక్టర్ కె.సుజాత జింకను పరిశీలించి మగ జింక అని గుర్తించారు. ఉదయం సుమారు ఐదు గంటల సమయంలో చనిపోయి ఉండొచ్చని ఆమె తెలిపారు. ఈ జింక రోడ్డు నుంచి దాటుతూ ఉన్నప్పుడు ఎదురుగా పొలానికి ఉన్న కంచెలో చిక్కుకొని చనిపోయిందని ఆమె తెలిపారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు గ్రామస్తుల సమక్షంలో పోస్టుమార్టం చేసి జింకను కాల్చినట్టు తెలిపారు. కార్వేటినగరం రేంజర్ అధికారి కె.వెంకట సుబ్బయ్య, ఎఫ్ఎస్ఓ కె.లోకేష్, ఎఫ్బిఓ ఎస్.రిహానా ఉన్నారు.





చిత్తూరులో అంగన్వాడీలు



చిత్తూరులో సిఐటియు -ఏఐటియుసి ఆధ్వర్యంలో..



పలమనేరులో..



నగరిలో సిఐటియు -ఏఐటియుసి ఆధ్వర్యంలో..



ఎస్ఆర్పురంలో అంగన్వాడీల మానవహారం



కార్వేటినగరంలో..



కదం తొక్కిన కార్మికవర్గం

- సార్వత్రిక సమ్మె సక్సెస్
- 30 యాక్ట్ పేరుతో నిర్బంధాలు పెట్టినా అధిగమించిన స్కీం వర్కర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం: దేశంలోని కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఫెడరేషన్లు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను బుధవారం చిత్తూరు జిల్లా కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. పోలీసులు 30 యాక్ట్ పేరుతో అనేక ఆంలుక్షలు పెట్టిన కార్మికులు కదంతొక్కారు. చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్దకు ఉదయం ఎనిమిది గంటల నుంచి భారీగా కార్మికవర్గం చేరుకుంది. 10 గంటలకు మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కే.సురేంద్రన్, ఏఐటియుసి జిల్లా నాయకులు దాసరి చంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా స్కీం వర్కర్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ఏఐటియుసి గౌరవాధ్యక్షుడు నాగరాజన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జయరాజ్ మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితమే సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం, కార్మిక సంఘాన్ని ఏర్పరచుకునే హక్కు, ఉమ్మడి భేరసారాల ద్వారా యజమానితో సమస్యలను పరిష్కరించుకునే హక్కు, కనీస వేతనం, ఉద్యోగ భద్రత వంటివి మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు దుష్ట కోడ్ల ద్వారా హరించబడుతున్నాయని ధ్వజమెత్తారు. పెన్షన్, ఈఎస్ఐ పిఎఫ్ వంటి సదుపాయాలు అంతం కానున్నాయని, అంతేకాదు మోడీ ప్రభుత్వం ఇంకో అడుగు ముందుకేసి కార్మికులు సమిష్టిగా మెమొరాండం సమర్పించిన దానిని ఆర్గనైజర్ క్రైంగా పరిగణించి విధంగా చట్టం చేస్తున్నారని, జర్నలిస్టుల చట్టాన్ని రద్దు చేస్తున్నారని అన్నారు. కష్ట జీవుల శ్రమ నుంచి సమస్త సంపదలో ఉద్భవిస్తాయని జగమెరిగిన సత్యమని, కాని ప్రభుత్వాలు ఇప్పుడు కార్పొరేట్ సంపద సృష్టికర్తలు అన్న తప్పుడు సిద్ధాంతాన్ని జనాలు మెదలలో ఎక్కించడానికి నాన్న పాట్లు పడుతున్నారని విమర్శించారు. కార్పొరేట్ల సృష్టించిన సంపద ఏమీ లేదు కానీ వారు ప్రజల సంపదను దేశ ఉమ్మడి ఆస్తి అయిన సహజ వనరులను భూములను ఆఖరికి వీటిని సైతం తమ సొంత ఆస్తిగా మార్చుకుంటున్నారని తెలిపారు. ప్రజల సొమ్మును బ్యాంకు నుండి అప్పులుగా తీసుకుని వాటిని ఎగ్గొట్టటమే గాక మాఫీ చేయించుకోగలుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఉపాధి దెబ్బతీస్తున్నారని తెలిపారు. అనేక రాయితీలు సంపన్నులకే కట్టబెడుతూ ఉపాధి హామీ వంటి కనీస సంక్షేమ కార్యక్రమాలను సైతం కోత పెడుతున్నారని అన్నారు. దేశాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టే ఈ అనాలోచిత వినాశకర విధానాలను ప్రతిఘటించాలని తెలిపారు.

ఇంత దుర్మార్గంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తుంటే దానికి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలోని కూటమి పార్టీలు కార్మికులపై దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల ద్వారా థర్టీ యాక్ట్ అమల్లో ఉందని పోలీసులు కార్మికులను బెదిరించడం దుర్మార్గమన్నారు.

మానవహారంతో స్తంభించిన ట్రాఫిక్

చిత్తూరు నగరంలో మానవహారం చేయడానికి పర్మిషన్ లేదని పోలీసులు కొద్దిసేపు అడ్డుకున్నారు. అయితే పెద్ద ఎత్తున కార్మికులతో కార్యక్రమాన్ని కొనసాగించడంతో పోలీసులు చేతులెత్తేశారు. అధికార పార్టీ చిన్న చిన్న కార్యక్రమాలకే రోడ్ల ఆక్రమించి గంటల తరబడి ఆటంకం కలిగించినా పట్టించుకోని పోలీసులు ప్రజాసమస్యలపై పోరాడుతున్న వారిని ఉక్కుపాదం మోపడం ఏమిటని ప్రశ్నించడంతో పోలీసులు వెన్కకి తగ్గారు. జిల్లా మొత్తం సమ్మె విజయవంతంగా జరిగింది. సార్వత్రిక సమ్మెలో చిత్తూరు జిల్లాలో 32 మండలాల్లోనూ పోలీసులు ఆంక్షలు పెట్టినప్పటికీ లెక్కచేయకుండా సమ్మెలో పాల్గొని ప్రదర్శనలు మానవహారాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షకీలా, గంగ, రాజశేఖర్, శ్రీధర్ బాబు బాలసుబ్రమణ్యం, అయ్యప్ప, బుజ్జి, మమత, ఏఐటియు నాయకులు రమాదేవి, గోపి, మనీ, విజయ్, గౌరీ, భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వి కోటలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి గోవిందు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు, సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు. పుంగనూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, భవన నిర్మాణ కార్మికులు ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నిర్వహించారు. జర్నలిస్ట్ యూనియన్ నాయకులు సతీష్, సలీం, గిరి శేఖర్, సిపిఐ పట్టణ కార్యదర్శి రామ్మూర్తి, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు. బైరెడ్డిపల్లె చెక్పోస్ట్ నాలుగు రోడ్ల కూడలిలో అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె సందర్భంగా నిరసన తెలిపిపారు. విజయపురం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ జ్యోతి, కళ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న 51 కేంద్రాలకు సంబంధించిన అంగన్వాడీలు సమ్మెలో పాల్గొన్నారు. గంగవరం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరీ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ, ఆశ, యానిమేటర్, విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి ప్రకాష్, వరలక్ష్మి, చంద్రబాబు మణి, పిచ్చయ్య, వ్యకాసం నాయకులు శివ, కెవిపిఎస్ నాయకులు సుబ్రహ్మణ్యం, నరసింహులు పాల్గొన్నారు.

సమ్మెలో భాగంగా పూతలపట్టు మండలం ఎం.బండపల్లిలో సిఐటియు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. నగరి పట్టణంలో సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరిని నిరసిస్తూ నగరిలో టవర్ క్లాక్ దగర మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శ కోదండయ్య, సిఐటియు కార్యదర్శి పెరుమాళ్ దానకోటి, సిపిఐ కార్యదర్శి వేలన్, మురళి, చిరంజీవమ్మ పాల్గొన్నారు. ఎస్ఆర్పురంలో కార్వేటినగరం ప్రాజెక్ట్ సిఐటియు అధ్యక్షురాలు విజయ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలో సమ్మెలో భాగంగా నిరసన తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్కు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిని అందించారు. పలమనేరుఅంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.



పుంగనూరులో ఏపిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో..



పుంగనూరులో అంగన్వాడీలు..



పూతలపట్టులో..



వికోటలో పంచాయతీ వర్కర్లు



గంగవరంలో



శాంతిపురంలో అంగన్వాడీల నిరసన

మామిడి రైతులకు అండగా...

- ఆంక్షల నడుమే వైఎస్ జగన్మోహన్రెడ్డి పర్యటన
- పోలీసుల ఓవరాక్షన్తో బంగారుపాళ్యంలో ఉద్రిక్తత


ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి), బంగారుపాళ్యం

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో కిలో మామిడి రూ.29లకు కొన్నామని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు కనీసం రూ.12 కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని ప్రశ్నించారు. కర్ణాటకలో కిలో రూ.16లకు కొనుగోలు చేస్తున్నారని, మామిడి రైతులకు పెట్టుబడి సాయం అందలేదని, వారి తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మామిడి రైతుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అయితే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్రెడ్డి పర్యటనకు 500 మంది కంటే అనుమతి లేదని, రోడ్డుషో నిర్వహించరాదని ముందస్తు ఎస్పి మణికంట చందోలు ఆంక్షలు విధించడం గమనార్హం.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డి చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటన అధికార పార్టీ ఆంక్షలతో రసాభాసగా మారింది. బుధవారం ఉదయం బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్ చేరుకున్నారు. అక్కడ 30 మందికి అనుమతి ఉండగా వందలాది మంది దూసుకురావడంతో హెలిప్యాడ్ వద్ద తోపులాట, తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళ కింద పడిపోయింది. ఈ క్రమంలోనే కాన్వాయ్ నుంచి వైఎస్ఆర్ పార్టీ కాంగ్రెస్ నేత విజయానంద రెడ్డి జారి కిందపడ్డారు. రోడ్ షో ర్యాలీకి అనుమతి లేనప్పటికీ.. హెలిపాడ్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు పెద్దసంఖ్యలో వాహనాలతో రోడ్ షో నిర్వహించారు. ఆంక్షలు ఉల్లంఘించి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీ ఛార్జ్ చేశారు. మామిడి కాయల మండి వద్దే ఆయన ప్రెస్మీట్ నిర్వహించారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జగన్తో మాట్లాడేందుకు 500 మందికి పోలీసులు అనుమతించారు. అయితే జగన్ రాకముందే వైఎస్ఆర్సిపి కార్యకర్తలు భారీగా మార్కెట్ యార్డులోకి చొచ్చుకుని వెళ్లారు. దీంతో అక్కడ ఉద్రిక్తత, రసాభాస చోటు చేసుకుంది. తన పర్యటన ఆద్యంతం ఈ ఆంక్షలు ఏంటని జగన్మోహన్రెడ్డి ఎస్పి మణికంఠ చందోలుతో వాగ్వాదానికి దిగారు.



బంగారుపాళ్యం మామిడి మార్కెట్లో మీడియాతో మాట్లాడుతున్న జగన్



రోడ్షోలో అభిమానులకు అభివాదం చేస్తూ..

మూడు కేసులు నమోదు: సిఐ శ్రీనివాసులు

బంగారు పాల్యం: మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్వటనలో ఆంక్షలు ఉల్లంఘించిన వారిపై మూడు కేసులు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అనుమతుల లేకుండా రోడ్డు షో నిర్వహించిన పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్ కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి మరి కొంతమంది పై కేసు నమోదు చేశారు. అలాగే మామిడి పంటను రోడ్డుపై పారబోసిన కేసు తుంబపాల్యానికి చెందిన అక్బర్, ఉదయ్ కుమార్లపై, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్పై కార్యకర్తల దాడి కేసులు నమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి: ఏపీడబ్ల్యూజేఎఫ్



చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉన్న ఆంధ్రజ్యోతి సీనియర్ ఫోటోగ్రాఫర్ శివకుమార్పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్షులు బి.ప్రకాష్ డిమాండ్ చేశారు. ఫోటోగ్రాఫర్ పై దాడిని నిరసిస్తూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం సాయంత్రం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని, దాడులకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని కోరారు. జర్నలిస్టుల రక్షణ కోసం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించాలని కోరారు. జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ కోశాధికారి కపానందరెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.కేశవులు, బాలసుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శులు కుభేంద్రన్, ప్రసాద్, కోశాధికారి నాగరాజు, మంజునాథ్, మురళి, దాము పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ను పరామర్శించిన ఎమ్మెల్యే మురళీమోహన్



వైఎస్ జగన్మోహన్రెడ్డి బంగారుపాళ్యం పర్యటన సందర్భంగా కవరేజ్కి వెళ్ళిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శివపై కొంతమంది దాడికి పాల్పడి ఉదయం నుంచి తీసిన ఫొటోలను తొలగించాలనడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన శివను బంగారుపాళ్యం ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. బుధవారం సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ శివను పరామర్శించి ఘటనను ఖండించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ ఈ దాడిని ఖండించారు. రైతుల పరామర్శ పేరుతో జగన్మోహన్రెడ్డి చేపట్టిన పర్యటన పూర్తిగా ప్రచార ఆర్భాటమే తప్ప, ఎక్కడా రైతులకు బాసటగా నిలవలేదన్నారు.

పిల్లల్లో వైకల్యం తగ్గించడమే లక్ష్యం : ఎంపి

- చిన్నారులకు నాణ్యమైన వైద్యసేవలు
- బాలల సత్వర చికిత్స కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిన్నపిల్లలలో వైకల్యంను తగ్గించడానికి గుర్తింపు, త్వరిత చికిత్స కల్పించడమే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లక్ష్యమని చిత్తూరు ఎంపి డాక్టర్ దగ్గుమళ్ల ప్రసాద్ రావు పేర్కొన్నారు. రూ.178.21 లక్షల ఎన్హెచ్ఎం గ్రాంట్ నిధులతో జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంను బుధవారం ఎంపి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమ్ వాహనంను ఎంపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ డిఈఐసి కేంద్రం ఆర్బిఎస్కె రాష్ట్ర బాల ఆరోగ్య స్వస్థ కార్యక్రమం కింద ఎన్హెచ్ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) పరిపాలనలో పనిచేస్తుందని, చిన్నపిల్లలలో వైకల్యం తగ్గించడానికి త్వరిత గుర్తింపు, త్వరిత చికిత్స కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యమని అన్నారు. ఈ కేంద్రం నాలుగు రకాల లోపాలపై 4డిఎస్ ప్రధానంగా పనిచేస్తుందని తెలిపారు. ఇందులో పుట్టుక సమయంలో లోపాలు, అభివృద్ధి లోపాలు, వ్యాధుల ద్వారా వచ్చే లోపాలు, పౌష్టికాహార లోపాలు మొత్తం 30 ఆరోగ్య సమస్యలు ఎంపిక చేయబడి స్క్రీనింగ్, త్వరిత గుర్తింపు, ఉచిత చికిత్సకు లోబడి పనిచేస్తాయన్నారు. 0-6 సంవత్సరాల పిల్లల నిర్వహణ ప్రత్యేకంగా డిఈఐసి స్థాయిలో జరుగుతుందని, 6-18 సంవత్సరాల పిల్లలు పరిస్థితులు స్థానిక ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కేంద్రంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు, దంత వైద్యులు, శ్రవణ, వాక్కు చికిత్స నిపుణులు, శారీరక థెరఫీ నిపుణులు, కంటి నిపుణులు, క్లినికల్ సైకాలజిస్ట్, మొదలగు స్పెషలైజేషన్ వారు ఇందులో పనిచేస్తారని, ఈ అవకాశాన్ని అవసరమైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన వైద్యశాల ప్రాంగణంలో రూ.178.21 లక్షలతో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (జిల్లా బాలల ముందస్తు చికిత్స కేంద్రం) ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సుదూర ప్రాంతాల నుండి జిల్లా ప్రధాన వైద్యశాలకు రావడం ఇబ్బందికారంగా ఉంటుందన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. దీనితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల ద్వారా కూడా ఈ వైద్యసేవలను అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పిల్లలకు వారు పుట్టిన ఆసుపత్రిలో వైద్యాధికారులు, నర్సులు, ఏఎన్ఎంల ద్వారా మొదటి స్థాయి స్క్రీనింగ్ జరుగుతుందని, 48 గంటల తర్వాత ఆరు వారాల వరకు ఆశ వాలంటీర్లు ఇంట్లోనే స్క్రీనింగ్ చేస్తారన్నారు. 6 వారాల నుంచి ఆరు సంవత్సరాల వరకు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో, 6-18 సంవత్సరాల పిల్లలను పాఠశాలల్లో పీహెచ్సీ/ యుహెచ్సి వైద్యులు స్క్రీనింగ్ చేస్తారన్నారు. లోపాలు గుర్తించిన పిల్లలకు డిఈఐసి సెంటర్ ద్వారా ఉచితంగా చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం చిత్తూరులోని డిఐసి కేంద్రం నుంచి 50 మంది పిల్లలకు వైద్యం అందించబడుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ప్రధాన వైద్యశాల ప్రాంగణంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని, ఈ సేవా కేంద్రంలో మానసిక, శారీకరక ఎదుగుదల లేని పిల్లలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్పర్సన్ కటారి హేమలత, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమ్ వాహనాన్ని ప్రారంభించిన ఎంపి

మెగా పిటిఎం 2.0 నిర్వహణకు సర్వసన్నద్ధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీన నిర్వహించే మెగా పిటిఎం 2.0 సమావేశాలను నిర్వహణ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 2,437 ప్రభుత్వ, ప్రైవేటు 506 పాఠశాలలు, 50 జూనియర్ కళాశాలలో మెగా పిటిఎంకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనేలా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా మూడులక్షల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమాలు విజయవంతం చేయాలని తెలిపారు. ఆయా నియోజకవర్గస్థాయిలో ఆయా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 1 నుండి 10వ తరగతి వరకు చదివే ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు వారితల్లి పేరున ఒక మొక్క నాటే కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు క్రమపద్ధతిలో అమలు చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం అందరికి అందేటట్లు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎస్.ఆర్.వి.కె.ఎం. కిట్స్ అందరికి అందేటట్లు, యూనిఫామ్స్ అందరూ వేసుకునేటట్లు, తల్లికి వందనం రాని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాల విద్యార్థులందరికి హెల్త్ చెకప్స్ పూర్తి చేసి ప్రతి విద్యార్థికి హెచ్‌పిసి కార్డ్స్ పూర్తి వివరాలతో అందేటట్లు చూడాలన్నారు. విద్యార్థులంతా స్కూల్ యూనిఫామ్‌తో హాజరయ్యేలా చూడాలన్నారు.

మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతం చేయండి: ఎంఈఓ

సోమల: మండలంలోని అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలలో 10వ తేదీ గురువారం నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి కేశవరెడ్డి కోరారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను తల్లిదండ్రులను తప్పక హాజరు పరిచి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తల్లిదండ్రులకు వివరించి పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను పేరెంట్స్ దృష్టికి తీసుకువెళ్లి తద్వారా పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల సహాయ సహకారాలు అందే విధంగా చూడాలని కోరారు. అలాగే మండల కేంద్రమైన సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ మెగా పేరెంట్ టీచర్ సమావేశాన్ని నిర్వహించేందుకు కళాశాలను అందంగా తీర్చిదిద్దడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ తెలిపారు.

రూ.8లు తగ్గకుండా కొనుగోలు చేసేలా చూస్తున్నాం: ఇంచార్జ్ మంత్రి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

మామిడి రైతుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల రైతులకు ధర విషయంలో ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది తోతాపురి మామిడి ఉత్పత్తి 2.5 లక్షల మెట్రిక టన్నులు మాత్రమే వచ్చిందిని, ఏడాదిలో ఏకంగా 6.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల రైతులకు ధర విషయంలో ఇబ్బంది కలుగకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మామిడి రైతులకు అండగా ఉంటూ మద్దతు ధర ప్రకటించారని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతున్నదన్నారు. తోతాపురి మామిడి కేజీకి రూ.4ల చొప్పున ప్రభుత్వం ఇస్తోందని, దీనికి తోడు రూ.8 తగ్గకుండా పల్ప్ ఫ్యాక్టరీలు, ట్రేడర్లు కొనుగోలు చేసేలా చూస్తున్నామన్నారు. మొత్తంగా మామిడి రైతులకు కనీసం కేజీకి రూ.12 రూపాయలు వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్ర వాటాగా రూ.130 కోట్లు ఇవ్వాలని గత నెలలోనే కేంద్రానికి లేఖ రాశామని తెలిపారు. ఇప్పటి వరకూ చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 3,08,261 మెట్రిక్ టన్నుల మేర మామిడిని ట్రేడర్లు, పల్ ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేశాయని, చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 1.65లక్షల మెట్రిక్ టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల మెట్రిక్ టన్నులు, అన్నమయ్యలో 16,400 మెట్రిక్ టన్నుల మేర మామిడి కొనుగోళ్లు జరిగాయన్నారు. ర్యాంపులు, మండీల ద్వారా మరో 81వేల మెట్రిక్ టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు విక్రయం జరిగిందన్నారు. ఇప్పటి వరకూ మొత్తం 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు జరిగిందని, దీంతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే తోతాపురి మామిడిని రాష్ట్రంలోకి రానియకుండా చూసి ఏపీలోని మామిడి రైతులు ఇబ్బందులను తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పల్ప్ పరిశ్రమల యాజమాన్యాల ఇబ్బందులనూ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని, మ్యాంగో పల్ప్ పై ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కేంద్రానికి ఇప్పటికే లేఖ రాశామని తెలిపారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అందించిన సుపరిపాలనను వివరిస్తూ బుధవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఇంటింటికీ ప్రచారం చేశారు. చిత్తూరు నగరపాలక పరిధిలో 11, 12, 14 వార్డుల పరిధిలో జోగుల్ కాలనీ, చెన్నమ్మ గుడిపల్లి, బండపల్లి, కనికాపురం, ఎల్బీపురం, అనుప్పల్లి, గంగాసాగరం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ జయలక్ష్మి, నియోజకవర్గం పరిశీలకులు సునీల్ కుమార్ పాల్గొన్నారు.


రామకుప్పం: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరుతున్నాయని మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏడాది సుపరిపాలనలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి నేతలు సుబ్రీ, వెంకటరమణ, మనోహర్, బాలరాజు, అవినాష్, మంజునాథ్, నాగరాజు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా జిల్లా కార్యదర్శిగా మదన్



ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చిత్తూరు జిల్లా కార్యదర్శిగా జీడీ నెల్లూరుకు చెందిన మదన్ నియమించబడ్డారు. తనకు ఈ పదవి ఇచ్చిన వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ఆదేశాలతో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మి, గుణశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రెట్టింపు ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని మదన్ తెలిపారు.

సింగిల్ విండోలకు ఇన్‌ఛార్జుల నియామకం





ప్రజాశక్తి- వీ కోట : మండలంలోని రెండు సింగిల్ విండోలకు పర్సన్ ఇంచార్జ్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వి కోట పిఎసిఎస్ చైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ ఎ.నారాయణ స్వామిని నియమించింది. అలాగే డైరెక్టర్లుగా కృష్ణాపురంకు చెందిన మాజీ పంచాయతీ పార్టీ అధ్యక్షులు ఎం.మూర్తి, కల్లుపల్లికి చెందిన సి.జయప్పలను నియమించింది. ముదరందొడ్డి సింగల్ విండో చైర్మన్‌గా సిఆర్.హరినాథ్ రెడ్డి, డైరెక్టర్లుగా చింతమాకులపల్లి చెందిన రాధాకృష్ణ, కొంగటంకు చెందిన ఏ.చిన్నప్పలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి నియామకం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

సింగిల్ విండో ఛైర్మన్‌గా నాగరాజు నాయుడు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండల సింగిల్ విండో ఛైర్మన్‌గా నాగరాజ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా దివాకర్ రెడ్డి, విశ్వనాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైనవారు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి, మండల అధ్యక్షులు రాధమ్మ కిషోర్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల అధ్యక్షులు రాధమ్మ కిషోర్ గౌడ్‌ని మర్యాదాపూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. రఘునందన్ గుప్తా, మాజీ సర్పంచులు కృష్ణమూర్తి, మంజునాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రం మొత్తం ఉచిత బస్సు ప్రయాణం ఉండాలి

ప్రజాశక్తి- పుంగనూరు: కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణించే విధంగా ఉండాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుండి కూటమి ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం జిల్లా వరకే పరిమితం చేశారు. మహిళలు రాష్ట్రంలో ఉచితంగా ఆర్టీసీలో (సాధారణ) ఎక్కడకైనా వెళ్లొచ్చు అని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు జిల్లా వరకు పరిమితం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలో వారికి పరిమితి లేదని, రాష్ట్రంలో ఎక్కడైనా వెళ్లొచ్చు అన్నారు. కనుక సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రస్థాయి ఉచిత ప్రయాణం బస్సుల్లో మహిళలకు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే రూ.1500లు నెలకి మహిళలకు ఇస్తామన్న పథకం కూడా ఆగస్టు 15 ఫ్రీబస్సుతో పాటు ఈ పథకం అమలుపరచి ప్రారంభించాలన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో వైసీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల పలకరింపుగా లేక బల ప్రదర్శనకు వచ్చారా అనే ప్రశ్న తలెత్తుతుందన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కాలేజీలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ డాక్టర్ వి.యం. థామస్ హాజరవుతారని వ్యక్తిగత కార్యదర్శి చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభిస్తారని, అలాగే కటికపల్లిలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారని తెలిపారు.

రూ.4.5 కోట్లతో నూతన రోడ్డు నిర్మాణం



ప్రజాశక్తి- శాంతిపురం: పలమనేరు జాతీయ రహదారి నుంచి రాళ్ళబూదుగూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు రూ.4.5 కోట్ల వ్యయంతో నూతన రోడ్డును నిర్మించనున్నారు. బుధవారం రాళ్ళబూదుగూరులో ప్రభుత్వ విప్ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్త ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పనులను ప్రారంభించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పలమనేరు జాతీయ రహదారి నుంచి కుప్పం నియోజకవర్గంలోని రాళ్ళబూదుగూరు గ్రామం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు సుమారు 9.5 కిలోమీటర్లు, రూ.4.5 కోట్ల వ్యయంతో తారు రోడ్డుకు ప్రజల సౌకర్యార్థం వేస్తున్నట్టు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను గుంతలు లేని రహదారులు ప్రజలకు కల్పించాలని ముఖ్యమంత్రి ధృవసంకల్పంతో ఉన్నారని అన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ ఒక సంవత్సర కాలంలో సుపరిపాలన, ఇంటింటికీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి వివరిస్తూ కరపత్రాలను అందించారు. డాక్టర్ సురేష్ బాబు, విశ్వనాథ్ నాయుడు, ఉదయ్ కుమార్, విజయరామిరెడ్డి, ఆర్ఎస్.మని, పివి.నాగరాజు, చంద్ర, గిరిధర్, చలపతి, లోకేష్, జయరాజు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

ప్రజాశక్తి- శాంతిపురం: పంచాయతీ పురోగతి సూచిక కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామ పంచాయతీలో పేదరిక నిర్మూలన, జీవనోపాధుల పెంపు, ఆరోగ్యం, చిన్నారులకు అనుకూలమైన సౌకర్యాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, పచ్చదనం, మౌలిక వసతుల్లో స్వావలంబన, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళలకు అనుకూలమైన విధానాలు వంటి తొమ్మిది కొలమానాల ఆధారంగా పంచాయతీల పనితీరును మదింపు చేశారన్నారు. ఈ లక్ష్యాలను సాధించి పంచాయతీల సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయా శాఖల కార్యదర్శులను ఆదేశించారు.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం 1983 – 85 ఫ్రెండ్షిప్ అకాడమీ, పలమనేరు పట్టణ సీనియర్లు ప్రయాణికుల సౌకర్యార్థం ఉచిత ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాలు చేయడం జరిగింది. ఆర్టీసీ చిత్తూరు –తిరుపతి జిల్లాల మేనేజర్లు రాము, జగదీష్, పలమనేరు ఆర్టీసీ మేనేజర్ స్వామీ వాటర్ ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన దాతలకు దుశ్యాలువులతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగస్తులకు సన్మాన కార్యక్రమం యూనియన్ గౌరవాధ్యక్షులు సుధీర్ ఆధ్వర్యంలో జరిగింది.

బీఎల్ఓలకు శిక్షణా తరగతులు ప్రారంభం



ప్రజాశక్తి- పూతలపట్టు : పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని బిఎల్ఓలకు బుధవారం పూతలపట్టు ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పూతలపట్టు తహశీల్దార్ రమేష్ బాబు ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల అధికారుల సూచన మేరకు ఢిల్లీ నుంచి శిక్షణ పొందిన వారి నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. బిఎల్ఓలు వారి విధులు ఎలా నిర్వహించాలి, విధివిధానాలను, ఓటర్లను చేర్చుకోవడం మరణించిన వారి ఓట్లను తొలగించడం వంటి వాటిపై బిఎల్వోలకు శిక్షణ ఇచ్చి తర్వాత శిక్షణపై పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిప్యూటీ తహశీల్దార్లు మహేశ్వరి, మునికృష్ణ బిఎల్ఓలు పాల్గొన్నారు.


డ్రోన్ టెక్నాలజీ పై అవగాహన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 'వన్ మిలియన్ వన్ బిలియన్' జాబ్ స్కిల్స్ కార్యక్రమం, డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ ఎస్.కె.మున్వర్ డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించి, దాని వినియోగాలు, ప్రస్తుత మార్కెట్ అవసరాలు, భవిష్యత్ అవకాశాల గురించి వివరించారు. కామర్స్ విభాగాధ్యక్షుడు కె.శంకర్ రెడ్డి విద్యార్థులు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్, లీడర్‌షిప్ వంటి నైపుణ్యాలు తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.



సమగ్ర అభివృద్ధి సాధిద్దాం: కడా పీడీ

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గ ప్రజలు సమన్వయం పాటించి, తమకు సహకరిస్తే సమగ్ర అభివృద్ధిని సాధిద్దామని కడా పీడీ వికాస్ మరమ్మత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కడ కార్యాలయంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చేతిద్దాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణ కుప్పం కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే కడా ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కుప్పం పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, నూతన పార్కుల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, భూగర్భ మురికి కాలువల నిర్మాణం, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు వంటి పనులు త్వరలో ప్రారంభం కానున్నట్టు తెలిపారు. ఎయిర్పోర్ట్ నిర్మాణం, హంద్రీ నీవా కాలువల నిర్మాణం, జాతీయ రహదారుల ఏర్పాటు వంటి పనులు చేస్తున్నామని, ఇందులో ఇప్పటికే కొన్ని పనులు పూర్తి అయిందని, మరికొన్ని పనులు జరుగుతున్నాయని, మిగిలిన పనులను సైతం త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం కొరకు భూ సేకరణ కార్యక్రమం దాదాపుగా పూర్తికావస్తున్నట్టు తెలిపారు. ఎయిర్పోర్ట్ నిర్మాణానికి గతంలో భూములు ఇచ్చిన వారిలో కొంతమందికి నష్టపరిహారం అందలేదని, అలాంటి వారికి చెల్లించవలసిన సొమ్మును వడ్డీతో సహా చెల్లించడానికి ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. అలాగే పలమనేరు నుండి క్రిష్ణగిరి వరకు ఫోర్ వే నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామని, ఆగస్టు నెలలో ఫోర్ వే నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. రోడ్ల నిర్మాణానికి క్షేత్రస్థాయి పనులను పూర్తి చేయడానికి సుమారు ఆరు మాసాల గడువు పడుతుందని, రోడ్ల నిర్మాణం పూర్తి కావడానికి మరో రెండు సంవత్సరాల సమయం పడుతుందన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు సైతం ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామని, స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు నిరుద్యోగ నిర్మూలనకు దోహదపడుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందని, త్వరితగతిన పనులు పూర్తి చేసుకొని పరిశ్రమలు ప్రారంభం అవుతుందన్నారు. అంతేకాకుండా మరిన్ని పరిశ్రమలను తీసుకువచ్చి, పూర్తిస్థాయిలో నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు సైతం సహకరించాలని, ప్రజల సమన్వయంతోనే పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యమని ఆయన ప్రజల సహకారాన్ని కోరారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మరమ్మత్

ఘనంగా కృష్ణారెడ్డి ఉద్యోగవిరమణ



ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): తాను పనిచేసిన పాఠశాలకు తన వంతుగా విద్యార్థులకు సహాయం చేయాలని ఉద్దేశంతో రూ.7.50 లక్షల వ్యయంతో విద్యాప్రాంగణంలో షెడ్డు ఏర్పాటు గడ్డం కృష్ణారెడ్డి చేశారు. అలాగే పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.20వేల నగదు ప్రోత్సాహం అందించారు. బుధవారం మండల కేంద్రంలోని యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గడ్డం కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంలో పాఠశాల ప్రాంగణంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుమారి ఇ.హేమలత ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. సుదీర్ఘమైన ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి చివరి మజిలీగా 2017 నుండి 2025 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాదమరిలో 36 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయనకు దుస్సాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించడం జరిగింది. విద్యా బోధనతో పాటు క్రమశిక్షణలో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయుడే కాకుండా మానవతా దృక్పథంతో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థికి రూ.20వేలు నగదు బహుమతిని అందించి పైచదువులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ విద్యార్థుల పాలిట కల్పతరువుగా మారారు. తాను పనిచేసిన పాఠశాలకు తన వంతు కర్తవ్యం ఏదో చేయాలని తపనతో, బాల బాలికలకు నీడనిచ్చే ఉద్దేశ్యంతో సాయి విద్యా ప్రాంగణాన్ని రూ.7,50,000లు (షెడ్డు)వెచ్చించి నిర్మించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, ఎంఆర్ఓ పార్థసారథి, ఎంఈఓ రుక్మిణి, ప్రసాద్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి అమర్నాథ్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు గిరి రాజా పాల్గొన్నారు. అలాగే కృష్ణారెడ్డి భార్య సులోచన, కుమారుడు రోహిత్ సాయి, కుమార్తె సుసుష్మా సాయి పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారి గౌరీ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలను మండల ప్రత్యేక అధికారిని గౌరీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి జయసింహ మాట్లాడుతూ సమావేశ మందిరం లేకపోవడంతో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా ఉందని సమావేశ మందిరం అవసరమని అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే మందులు మాత్రలు నిలువ చేసేందుకు ప్రత్యేక గది అవసరమని తెలియజేశారు. నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ విధానంలో పాఠాలు బోధించేందుకు ఐఎఫ్బి ప్యానెల్ ఐదు ఉన్నాయని, మరొక ఐదు అవసరమని ప్రధానోపాధ్యాయురాలు కుసుమాంబ తెలిపారు. 260 మంది విద్యార్థులు ఉన్నారని గదులు చాలక ఇబ్బంది పడుతున్నామని నాడు నేడు కింద తరగతి గది మంజూరై అసంపూర్తిగా ఉందని నిధులు కేటాయిస్తే భవనాన్ని పూర్తిచేసి వినియోగం తీసుకువస్తామని కోరారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీకి వచ్చిన అధికారులు రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించిన ప్రత్యేక అధికారిని ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని వాటిని ఫోటోలు తీసి రిజిస్టర్ పెట్టి అందులో నమోదు చేసి అప్డేట్‌లో ఉండాలని సిబ్బందిని కోరారు. అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం విద్యార్థులకు అందుతున్న పాలు గ్రుడ్లు తదితర వస్తువులను పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఐసిడిఎస్ సూపర్వైజర్ హరితకు సూచనలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ ఏపీవో షౌకత్ అలీ, పంచాయతీ కార్యదర్శి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి సూచనలు అధికారి గౌరి

పంటలపై ఏనుగుల మంద స్వైరవిహారం

హడలిపోతున్న అటవీ ప్రాంత రైతులు

ప్రజాశక్తి - రామకుప్పం : కౌండిన్య అభయారణ్య పరిధిలోని రామకుప్పం మండల అటవీ సరిహద్దు గ్రామాల పంట పొలాలపై ఏనుగులు విరుచుకుపడుతున్నాయి. మండలంలోని 89పెద్దూరు గ్రామసమీప తోటలపై సోమవారం రాత్రి ఆరు ఏనుగుల మంద స్వైరవిహారం చేసింది. తమిళనాడు అడవుల నుంచి వి.కోట మండలం నాయకనేరి అడవుల మీదుగా వచ్చిన ఏనుగులు 89పెద్దూరు గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన అరటి, టమాటా, మామిడి తోటలపై దాడులు చేసి.. విధ్వంసం సృషించాయి. ఓ రైతుకు చెందిన 30 అరటిచెట్లను ధ్వంసం చేశాయి. మరో రైతు టమాటా తోటను కొంతమేర ధ్వంసం చేశాయి. సమీప మామిడి తోటల్లో సంచరిస్తూ మామిడికాయలు, పండ్లను తిన్నంతగా తిని నేలరాల్చాయి. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు, ట్రాకర్లతో కలిసి పెద్దూరు అటవీ ప్రాంతానికి చేరుకుని డప్పులు వాయిస్తూ, టపాకాయలు పేల్చుతూ ఏనుగుల గుంపును అతికష్టం మీద అడవిలోకి మళ్లించారు. ఇందులో నాలుగు పెద్ద ఏనుగులు, రెండు గున్న (పిల్ల) ఏనుగులు ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటికే 30 రోజులుగా ననియాల గ్రామ పరిసర పొలాలు, తోటలపై ఒంటరి ఏనుగు పంటలు తొక్కి నాశనం చేస్తూ రోడ్లపైకే వస్తోంది. ఇప్పుడీ ఏనుగుల మంద కూడా తోడవడంతో అటవీ సమీప గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగులను పొలాలు, గ్రామాల వైపు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తోందే తప్ప, ఏనుగుల దాడుల నివారణకు శాశ్వత పరిష్కారానికి చొరవ చూపటం లేదని రైతులు వాపోతున్నారు.



రైతులకు పంట నష్టపరిహారం పంపిణీ



ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని అటవీ సమీప ప్రాంతాలైన ననియాల, రామాపురం తాండ, పంద్యాల మడుగు పీఎంకే తాండ తదితర గ్రామ ప్రాంతాల్లో రైతుల పండిస్తున్న పంటలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం ఏనుగు దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఏనుగుల దాడిలో నష్టపోయిన 24 మంది రైతులకు గాను లక్ష 98 వేల 9 వందల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగులు పంటలపై చొరబడకుండా శాశ్వతమైన సోలార్ కంచె, కందకాల మరమ్మతులను చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ శాఖ అధికారులు, టిడిపి రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డి, నరసింహులు, ఆంజనేయ రెడ్డి, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరిమాకులపల్లిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్ బాలాజీ చరణ్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అలాగే రక్తహీనత వల్ల తల్లికిబిడ్డకి కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించి రక్తహీనతకు ఐరన్ టాబ్లెట్లు అందించారు. అనంతరం గర్భిణులకు రెడ్ క్రాస్ కేశవరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ ఇంచార్జ్ పాపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో డాక్టర్ విజయచంద్ర గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం ఉచితంగా అందజేశారు. డాక్టర్ శాలిని, మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం.వి.కేశవ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షులు, చిత్తూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.వి. శ్రీధర్ రెడ్డి సహకారంతో మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చే రోగులు, గర్భిణులకు అన్నదానం చేశారు. డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సమాజ సేవలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర చాలా కీలకమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఈ నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలైన రోప్స్, సాయిల్ గ్రీన్, ఎన్‌వైకే సంస్థలు గిరిజనులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలైన రోప్స్, సాయిల్ గ్రీన్, ఎన్‌వైకే సంస్థల నేతృత్వంలో బుధవారం పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలం, మొగిలివారిపల్లి గ్రామం, జయంతి ఎస్‌టి కాలనీలో నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమానికి ఎంపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు సునీల్ చౌదరి, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాటిభట్ల శేఖర్ బాబు, రోప్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పశుగ్రాసం సాగు చేయండి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: పాడి రైతులు అధిక దిగుబడి, అధిక పోషక విలువలు కలిగిన పశుగ్రాసం సాగు చేయడంపై దృష్టి సారించాలని పాడి పశువుల పెంపకంలో పోషణ కీలకపాత్ర పోషిస్తుందని పశుసంవర్ధక శాఖ సంచారకులు డాక్టర్ అరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఇందులో భాగంగా ఈనెల 7 నుండి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు జరుపుతున్నామని మండలంలోని రెడ్డెపల్లి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో పశుపోషకులకు రాయితీపై పశుగ్రాసాలను పశు వైద్య కేంద్రాలు రైతుసేవ కేంద్రాల ద్వారా అందిస్తామని పేర్కొన్నారు. పశుపోషకులకు వ్యయం తగ్గించేందుకు ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో నూరు శాతం రాయితీతో పశుగ్రాసాలను అభివృద్ధి పరిచే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ప్రధానంగా గడ్డి కేంద్రాల ప్రాధాన్యతను తెలియజేస్తూ మిశ్రమ పంటల విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని పాడి రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మురళీమోహన్ కోరారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి- టకార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదర్ రావు మాట్లాడుతూ ప్రపంచ జనాభ దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై జరుపుకుంటామన్నారు. జనాభా పెరుగుదలపై అవగాహన కల్పించడమే కాకుండా దాని ప్రభావాన్ని గుర్తు చేయడయం జరుగుతుందని, జనాభా పెరిగితే ఆహారం, నీరు, నివాసం, నిరోద్యగం సమస్యలు ఉంటాయని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ పోటీల్లో విజేతలుగా పావని (కత్తెరపల్లి), రామకృష్ణ (కేవీబీ పురం), మనోజ్కుమార్(వరదప్పనాయుడు మున్సిపల్ హైస్కూల్ చిత్తూరు), అదే విధంగా వ్యాసరచన పోటీల్లో విజేతులుగా నవ్య (జడ్పీహెచ్ఎస్ గేటుపుత్తూరు), శశిర (జడ్పీహెచ్ఎస్ కత్తెరపల్లి), రిషిత (జడ్పీహెచ్ఎస్ అత్తూరు) నిలిచారు. ప్రోత్సాహక బహుమతికి లాస్య (జడ్పీహెచ్ఎస్ చిత్తూరు) ఎంపికయ్యారు. వారికి డైట్ ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెమోంటోలతోపాటు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది.